
సాక్షి
తూర్పుగోదావరి
గురువారం | 13 | జూలై | 2023



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం తూర్పు డెల్టాకు 3,700, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 6,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.



నిత్యాన్నదాన పథకానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి బుధవారం దర్శిపూడి వేంకటేశ్వర్లు(తుని) రూ.1,01,116, జమ్మలమడక రమణప్రసాద్(విశాఖ) రూ.1,00,001 విరాళాన్ని సమర్పించారు.

కుక్కుటేశ్వరునికి వెండి కవచం



పిఠాపురం: పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వర స్వామికి ఒక భక్తుడు బుధవారం వెండి కవచం బహూకరించినట్లు ఆలయ ఈఓ వి శ్రీనివాసరావు తెలిపారు.

న్యూస్‌రీల్

13 మంది వీఓఏల సస్పెన్షన్

- జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ

అనపర్తి: అనపర్తి మండలంలో వైఎస్సార్ క్రాంతి పథానికి చెందిన 13 మంది గ్రామ సంఘం సహాయకులను(వీఓఏ) కలెక్టర్ కె.మాధవీలత బుధవారం సస్పెండ్ చేశారు. వీరిపై వచ్చిన ఫిర్యాదులు విచారించి ఈ చర్యలు తీసుకున్నట్లు ఏపీఎం జిలాని తెలిపారు. వివరాలిలా.. మండలంలో వైఎస్సార్ క్రాంతి పథంలో కొంత మంది గ్రామ సంఘ సహాయకులు విధుల్లో నిర్లక్ష్యం, అక్రమ వసూళ్లు, ఉన్నతి రుణాలు, పీఐఎఫ్, గ్రామ సంఘం రివాల్వింగ్ ఫండ్, ఆసరా పథకం నిధుల దారి మళ్లింపు, దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు గత ఏప్రిల్‌లో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ దీనిపై విచారణకు ఆదేశించారు. అప్పటి ఏపీఎం రామరాజుతో కలసి కొంతమంది వీఓఏలు రూ.39,32,645 అవకతవకలకు పాల్పడినట్లు విచారణలో గుర్తించారు. దీంతో 13 మంది వీఓఏలను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెండైన వీఓఏల్లో తొమ్మిది మంది రూ. 20,93,520 అక్రమ వసూళ్లకు పాల్పడగా, ఇప్పటికే వారి నుంచి రూ.3.60 లక్షలు వసూలు చేశారు. మిగిలిన రూ.17,33,520 రికవరీ చేయనున్నారు. సస్పెండైన వారిలో అనపర్తి మండలం మహేంద్రవాడకు చెందిన నల్లిమిల్లి నాగదుర్గ, మల్లేశ్వరపు సత్యశిరీష, పాక వెంకటలక్ష్మి (దుప్పలపూడి), కోరుమిల్లి కుమారి (కొప్పవరం), గోగి సత్యవేణి (లక్ష్మీనరసాపురం), అనపర్తికి చెందిన గాలి వరలక్ష్మి, కర్రి సత్యవేణి, పాండ్రంకి రాణి, పైలా రత్నం, కాకర్లమూడి స్వప్నదీప్తి, మందనక్క లలిత, పలివెల అనితరాణి, కోలా దేవి దుర్గలు ఉన్నారు.

బడిఈడు పిల్లలందరూ పాఠశాలల్లో ఉండాలి



బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పుతున్న కలెక్టర్ మాధవీలత

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లాలోని బడిఈడు పిల్లలందరూ పాఠశాలల్లో ఉండాలని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. స్థానిక నాగరాజా నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో బుధవారం బడిబయట పిల్లలను తిరిగి బడిలో చేర్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, నమోదు, నిలకడ నిష్పత్తి సమతూకంలో ఉండేలా చర్యలు చేపట్టిందన్నారు. పాఠశాలలో చేరిన ప్రతి విద్యార్థి తన చదువును విజయవంతంగా పూర్తిచేసి ఉన్నత చదువులకు వెళ్లాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అన్నారు. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో కూడా తప్పిన విద్యార్థులు సమయాన్ని బయట వృథాగా గడపకుండా తిరిగి రెగ్యులర్ విద్యార్థిగా పాఠశాలలో పదిలో చేరే అవకాశం కల్పించారన్నారు. కార్యక్రమంలో అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, నాగరాజా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.చక్రధర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మోటూరి మంగారాణి, ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవీఎం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న నిత్యాన్నదాన పథకానికి విరాళాలు వెల్లువెత్తాయి. కొత్తపేటకు చెందిన బి.సత్యనారాయణ, అర్జ దంపతులు రూ.15వేలు, కైకలూరు మండలం కొత్తపేట వాసులు వి.రామాంజనేయులు రూ.10,116, రాజమహేంద్రవరానికి చెందిన జె.సత్యనారాయణప్రసాద్, పద్మజ దంపతులు రూ.10,116, కె.వెంకటకిరణ్‌కుమార్, అంజనీ దంపతులు రూ.10,116 ఇచ్చినట్లు చైర్మన్ రమేష్‌రాజు తెలిపారు.

రిజిస్ట్రేషన్‌లో ఈ-స్టాంపింగ్..!



- భూముల క్రయ, విక్రయాల్లో పారదర్శకత
- రిజిస్ట్రేషన్‌శాఖ కొత్త విధానానికి శ్రీకారం
- మ్యాన్యువల్‌గా స్టాంపుల విక్రయాలు బంద్
- అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు

సాక్షి, రాజమహేంద్రవరం: రిజిస్ట్రేషన్ శాఖలో పారదర్శకతకు పెద్దపీట వేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నాన్ జ్యుడీషియల్ స్టాంపుల విక్రయాల్లో అవకతవకలకు చెక్ పెట్టే దిశగా రంగం సిద్ధమైంది. పాత తేదీలతో స్టాంపులు కొనుగోలు చేసి తద్వారా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి అక్రమాలకు పాల్పడటం పారిపాటిగా మారేది. ఈ విధానాన్ని పూర్తిగా అరికట్టేందుకు రిజిస్ట్రేషన్ శాఖలో కొత్త విధానానికి నాంది పలికింది. 'ఈ-స్టాంపింగ్'తో భూముల క్రయ విక్రయాల్లో పారదర్శకత తీసుకువచ్చే బృహత్తర విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. ఇప్పటికే ఈ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రాచుర్యం పొందుతోంది. ఏ రోజుకారోజు అనే నినాదంతో ఈ-స్టాంపుల విక్రయాలను చేపట్టింది. స్టాంపుల విక్రయాల కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను సైతం అందుబాటులోకి తీసుకువచ్చింది.

తూర్పులో 12 కార్యాలయాల్లో అమలు

జిల్లా వ్యాప్తంగా 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభతరం చేసేందుకు 52 గ్రామ సచివాలయాల్లో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ-స్టాంపింగ్ ప్రక్రియ జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ అమలు చేస్తున్నారు. అన్ని కార్యాలయాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా నాన్ జ్యుడీషియల్ 'ఈ-స్టాంపుల' విక్రయాలు చేపడుతున్నారు. మ్యాన్యువల్ స్టాంపుల విక్రయాలు పూర్తి స్థాయిలో నిలుపుదల చేశారు. వాటి సరఫరాను సైతం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు నిలిపివేశారు. వినియోగదారులు ఈ-స్టాంపుల వినియోగంపై దృష్టి సారించాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సూచిస్తున్నారు.



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

వెండర్లకు లైసెన్సులు

ఇప్పటివరకు నాన్ జ్యుడీషియల్ స్టాంపుల ద్వారా భూముల క్రయ, విక్రయాలు జరిగేవి. వీటిలో డాక్యుమెంట్ రైటర్లు కీలక భూమిక పోషించేవారు. ప్రస్తుతం ×ఈ-స్టాంపుల విక్రయాల కోసం జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న వెండర్ల(విక్రయదారుల)తో పాటు కొత్తవారికి నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. వందల సంఖ్యలో ఈ-స్టాంపింగ్ వెండర్ లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. పూరి స్థాయిలో విచారణ చేపట్టి వారికి లైసెన్సులను మంజూరు చేస్తారు. ఈ స్టాంపింగ్ కంప్యూటర్ పరిజ్ఞానంతో చేపట్టాల్సి ఉండటంతో పది, ఆపై విద్యార్హత ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నిర్దేశించిన సమయంలోగా లైసెన్సులు జారీ చేయనున్నారు.

ఇప్పటికే డిజిటలీకరణ

స్టాంపులు–రిజిస్ట్రేషన్ శాఖలో పాత డాక్యుమెంట్ల డిజిటలీకరణకు ప్రభుత్వం ఇప్పటికే శ్రీకారం చుట్టింది. 1850 నుంచి 1999 వరకు జరిగిన రిజిస్ట్రేషన్లకు సంబంధించి డాక్యుమెంట్లు ఇకపై ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రానున్నాయి. ప్రక్రియ యుద్ధప్రాతిపదికన జరుగుతోంది. ప్రక్రియ పూర్తి స్థాయిలో అమలైతే రికార్డులు వెతికి మాన్యువల్‌గా రాసివ్వాల్సిన ప్రయాసలకు విముక్తి కలుగుతుంది. ప్రస్తుతం ఈ-స్టాంపింగ్ తీసుకురావడంతో రిజిస్ట్రేషన్ ఇకపై పూర్తి పారదర్శక సేవలు అందించనుంది.

ఈ-స్టాంపింగ్ అమలయ్యే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు

రాజమండ్రి, పిడింగొయ్య, కడియం, అనపర్తి, రాజానగరం, కోరుకొండ, సీతానగరం, కొవ్వూరు, బిక్కవోలు, అనంతపల్లి, వేగేశ్వరపురం, నిడదవోలు

భవిష్యత్తు ఈ-స్టాంపింగ్‌దే..



రిజిస్ట్రేషన్ శాఖలో పారదర్శక సేవలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఫలితంగా నాన్ జ్యుడీషియల్ స్టాంపుల స్థానంలో ఈ-స్టాంపింగ్ విధానం ప్రవేశ పెట్టింది. జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ-స్టాంపు విధానం అమల్లో ఉంది. రానున్న రోజుల్లో మ్యానువల్ స్టాంపుల విక్రయాలు పూర్తి స్థాయిలో బంద్ అయ్యే అవకాశం ఉంది. వినియోగదారులు కూడా ఈ-స్టాంపుల కొనుగోలుపై దృష్టి పెట్టాలి.

– అనందరావు, జిల్లా రిజిస్ట్రార్

కేన్సర్ రోగిని ఆదుకున్న ఆరోగ్యశ్రీ

బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ విజయవంతం



చికిత్స వివరాలు తెలియజేస్తున్న అంకాలజిస్ట్ డాక్టరు మురళీధర్., తదితరులు

కాకినాడ రూరల్: కాకినాడ మెడికవర్ ఆస్పత్రిలో కేన్సర్ రోగికి చేసిన బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ విజయవంతమైంది. గైగోలుపాడుకు చెందిన 55ఏళ్ల వ్యక్తికి బ్లడ్ కేన్సర్ బారిన పడ్డాడు. వైద్యానికి అయ్యే భారీ వ్యయాన్ని భరించలేని ఇతనికి జగనన్న ప్రభుత్వం అండగా నిలిచింది. ఆరోగ్య శ్రీ ద్వారా రూ.6.5లక్షలు మంజూరు చేసింది. శస్త్ర చికిత్స అనంతరం 20రోజులకు రోగి పూర్తిగా కోలుకోవడంతో కుటుంబ సభ్యులు, బాధితుడు సమక్షంలో వైద్యులు మెడికవర్ ఆస్పత్రిలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఆంకాలజిస్ట్ డాక్టరు మురళీధర్ మాట్లాడుతూ కేన్సర్ అంటే భయపడనవసరం లేదని చెప్పారు. సరైన సమయంలో చికిత్స అందిస్తే కోలుకుంటారన్నారు. రక్త కణ సంబంధిత కేన్సర్లకు బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ మంచి పరిష్కారం చూపుతుందన్నారు. లుకేమియా, లిఫోమా, మైలోమా అనే బ్లడ్ కేన్సర్లలో మొదటి రెండు పిల్లలకు, పెద్దలకు వస్తాయన్నారు. మైలోమా పెద్దవాళ్ళలోనే ఎక్కువగా కనిపిస్తుందన్నారు. గైగోలుపాడుకు చెందిన బాధితునికి బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశామన్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఇది మొదటిదన్నారు. రోగి పూర్తిగా కోలుకున్నట్టు తెలిపారు. ఆస్పత్రి యూనిట్ హెడ్ సిద్ధారెడ్డి మాట్లాడుతూ సరైన సమయంలో రావడంతో రోగి ప్రాణాలు కాపాడిగలిగామన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా ప్రభుత్వం రూ.6.5లక్షలు మంజూరు చేసిందన్నారు. రోగికి పైసా ఖర్చు అవ్వలేదన్నారు. బాధితుని భార్య, సోదరుడు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.

మోరంపూడి వద్ద ప్రమాద నివారణ చర్యలు

ఎంపీ భరత్ ఆదేశం

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి హైవేపై రోడ్డు ప్రమాదాల కట్టడికి గట్టి చర్యలు తీసుకోవాలని ఎంపీ భరత్ రామ్ ఆదేశించారు. ఇక్కడ జరుగుతున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి (ఎఫ్‌ఓబీ) నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఇటీవల రెండు మూడు రోడ్డు ప్రమాదాలు జరిగిన నేపథ్యంలో సరైన చర్యలు తీసుకోలేదంటూ ఎంపీ నిర్మాణ సంస్థ ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లైటింగ్ ఏర్పాటు చేయాలని, జంక్షనుకు రెండు వైపులా ప్రమాదాల నివారణకు ఇసుక డ్రమ్స్, బ్యారికేడ్స్, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని చెబుతున్నా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని కాంట్రాక్టు ప్రతినిధులను, ట్రాఫిక్ సీఐ శంకర్ నాయక్, ఎస్సై సూర్యకుమార్‌ను ప్రశ్నించారు. రోడ్డుకు రెండువైపులా 300 మీటర్ల పొడవునా ఫ్లడ్ లైట్స్, హైమస్ట్ లైట్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఎఫ్‌ఓబీ పనుల్లో పురోగతి కనిపిస్తోందన్నారు. పనులు మరింత వేగవంతం కావాలన్నారు. ఇసుకతో నింపిన డ్రమ్స్, బారికేడ్స్, స్పీడ్ బ్రేకర్స్..ఎక్కడికక్కడ ఏర్పాటు చేస్తే వేగంగా వాహనాలు రావని, తద్వారా ప్రమాదాలు నివారించవచ్చునన్నారు. నేషనల్ హైవే పీడీ డీ సురేంద్ర, అర్బన్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, గూడూరి రాధిక, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, బర్రేకొండబాబు, మార్గాని సురేష్, ఎస్‌వి.శ్రీనివాస్,పార్టీనేతలు పాల్గొన్నారు.



మోరంపూడి ఎఫ్‌ఓబీ పనుల పురోగతిపై ఆరా తీస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

పక్కాగా ఓటరు జాబితా సవరణ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లా వ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణలో చేర్పులు, మార్పులకు సంబంధించిన డేటాను పూర్తిస్థాయిలో పక్కాగా నిర్వహించాలని, అందుకు సహాయ ఎన్నికల నమోదు అధికారుల వ్యక్తిగత పరిశీలన అవసరమని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ ఆదేశించారు. జిల్లాలోని ఓటర్ల జాబితా సవరణ చేర్పులు, తొలగింపులపై నియోజకవర్గ ఎలక్టోరల్ నమోదు అధికారులు, సహాయ అధికారులు, ఎన్నికల సిబ్బందితో బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి ఇంటింటి సర్వే కోసం బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) క్షేత్ర స్థాయిలో పర్యటిస్తారన్నారు. ఆ క్రమంలో సేకరించిన డేటా ఎంట్రీ విషయంలో ఆయా నియోజక వర్గాలకు చెందిన ఎన్నికల నమోదు అధికారులు వ్యక్తిగత పర్యవేక్షణ బాధ్యతలను చేపట్టాలన్నారు. జిల్లాలో 2023 మే చివరి నాటికి 15,47,419 ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 7,58,578 మంది, మహిళలు 7,88,726 మంది ఇతరులు 115 మంది ఉన్నారన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి బూత్ స్థాయి అధికారుల వరకూ దశల వారీగా శిక్షణ తరగతులు నిర్వహించి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వేను జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకూ చేపట్టాలన్నారు. సమావేశంలో డీఆర్వో జి.నరసింహులు, నియోజక వర్గ ఎన్నికల అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జేసీ తేజ్ భరత్ తదితరులు

సమర్థంగా రీసర్వే పనులు

రీసర్వే ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు, సీసీఎల్ఆర్ నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి రెవెన్యూ, సర్వే అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ అన్నారు. వాటి ప్రగతిపై బుధవారం ఆయన సమీక్షించారు. జూలై 6 నుంచి 11 వరకు నిర్దేశించిన లక్ష్యాలపై సమీక్ష చేస్తూ, గ్రౌండ్ ట్రూథింగ్ సంబంధించి పోచవరం, హుకుంపేట, చీపురుగూడేలకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో అధికారుల పనితీరును అభినందించారు. జూలై 12 నుంచి 19 వరకూ నిర్దేశించిన లక్ష్యాలను ముందస్తు కార్యాచరణ ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలన్నారు. గ్రౌండ్ ట్రూథింగ్ 54 గ్రామాల్లో పూర్తి చేయగా, ఈ వారం రాజానగరం మండలం కానవరంలో జీటీ పనులు పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించామన్నారు.

అజాత శత్రువు అస్తమయం

- కింగ్ మేకర్ నుంచి కింగ్ వరకూ ఎదిగిన వైనం
- రాజోలుతో పాటు రాష్ట్ర రాజకీయాల్లోనూ రాణించిన అల్లూరు

మలికిపురం: రాజోలు నియోజకవర్గ రాజకీయాలలో అజాత శత్రువుగా ముద్ర పడిన మాజీ ఎమ్మెల్యే అల్లూరు కృష్ణంరాజు(83) బుధవారం కన్నుమూశారు. ఆది నుంచీ కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నప్పటికీ రాజకీయాలలో ఆయన కింగ్ మేకర్ పాత్ర పోషించారు. 1980 నుంచీ రాజోలు నియోజకవర్గంతో పాటు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కింగ్‌మేకర్ పాత్ర పోషించిన కృష్ణంరాజు 1997 నుంచి రాజోలు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి ముఖ్య అనుచరునిగా ఉంటూ కాంగ్రెస్‌లో చక్రం తిప్పిన కృష్ణంరాజు 1999 ఎన్నికలలో తొలిసారి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. అయినప్పటికీ అనంతరం రాజశేఖరరెడ్డి ఆశీస్సులతో 2004లో పోటీ చేసి రాష్ట్రంలోనే అత్యధికంగా 38,918 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అప్పటి మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావుతో కలిసి రాజశేఖరరెడ్డికి అనుంగు శిష్యులుగా జిల్లా రాజకీయాలను శాసించారు. నియోజకవర్గంలో ఎంతోమంది యువ నాయకులను ప్రోత్సహించి రాజకీయ పదవులను కట్టబెట్టారు. ఆయన హయాంలో రాజోలు నియోజక వర్గంలో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామీణ తాగునీటి కుళాయిల ఏర్పాటుతో పాటు దిండిలో టూరిజం కేంద్రం ఏర్పాటు చేసి ఎందరికో ఉపాధి కల్పించారు. అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ నిర్మాణానికి రూ.4 కోట్ల నిధులు మంజూరు చేయించి అభివృద్ధికి బాటలు వేశారు.



పార్టీలో చేరిన సమయంలో జగన్‌తో కృష్ణంరాజు(పాత చిత్రం)

ప్రస్తుతం విజయవంతంగా నడుస్తున్న అంతర్వేది నిత్యాన్నదానం పథకం ఆయన హయాంలోనే ప్రారంభం అయింది. ఆయన హయాంలో శంకరగుప్తం మేజరు డ్రైన్‌పై గొల్లపాలెం, కేశనపల్లి, చింతలమోరి వంతెనలు నిర్మాణం అయ్యాయి. 2009 ఎన్నికలలో రాజోలు నియోజకవర్గం ఎస్సీ రిజర్వు అయినప్పటికీ ఆయన శిష్యుడు రాపాకవర ప్రసాదరావును ఎమ్మెల్యేగా గెలిపించి, ఆయన మరో శిష్యుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను జెడ్పీ చైర్మన్‌గా చేశారు. ప్రస్తుతం వేణు రాష్ట్ర మంత్రిగా ఉన్నారు. రాజశేఖరరెడ్డి మృతి అనంతరం ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెంటే ఉండి రాజకీయ ప్రయాణం చేశారు. ప్రస్తుతం కృష్ణంరాజు భార్య మల్లీశ్వరి టీటీడీ బోర్డు సభ్యులుగా ఉన్నారు.

నేడు అంత్య క్రియలు

కృష్ణంరాజు భౌతిక కాయం బుధవారం అర్ధ రాత్రి హైదరాబాద్ నుంచి స్వస్థలం సఖినేటిపల్లి వస్తుందని బంధువులు తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు రాజోలు మండలం సోంపల్లి గోదావరి తీరం శ్మశాన వాటికలో కృష్ణంరాజు అంత్యక్రియలు నిర్వహిస్తారు. అంత్యక్రియలు పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

క్లుప్తంగా

ఇసుక విధానంతో నష్టం



సభలో మాట్లాడుతున్న సోము వీర్రాజు

మలికిపురం: ఇసుక విధానంలో గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్ సీపీ విధానాలు ప్రజలకు నష్టం కలిగించాయని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు పేర్కొన్నారు. బుధవారం మలికిపురం మండలం చింతలమోరి గ్రామంలో జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే బీజేపీ అధికారంలోకి రావాలన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్ ఎనిమిది పథకాలకు మీటలు నొక్కి ప్రజలకు డబ్బులు వేస్తుంటే దేశంలో ప్రధాని మోదీ 20 పథకాలకు మీటలు నొక్కి ప్రజలకు డబ్బులు వేస్తున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే వేమా, కర్రి చిట్టిబాబు, ఎఫ్‌సీఐ డైరెక్టర్ దొడ్డా నాగబాబు, రాష్ట్ర కిసాన్ మోర్చా సభ్యురాలు అల్లూరి పద్మావతి పాల్గొన్నారు.

హ్యుండయ్ ఎక్స్‌టర్ మార్కెట్‌లోకి విడుదల



హ్యుండయ్ ఎక్స్‌టర్ కొత్త కారు ఆవిష్కరిస్తున్న యూట్యూబర్ గణేష్. చిత్రంలో షోరూమ్ సేల్స్ మేనేజర్ శ్రీనివాసరావు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): హ్యుండయ్ సరికొత్త ఎక్స్‌టర్ (మైక్రో ఎస్‌యూవీ) కొత్త కారును బుధవారం కాకినాడ సాయిస్వర్ణ హ్యుండయ్ షోరూమ్‌లో ప్రముఖ యూట్యూబర్ గణేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షోరూమ్ సేల్స్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎక్స్‌టర్ ప్రారంభ ధర రూ.5.99 లక్షల నుంచి రూ.9.31 లక్షల వరకూ ఉందన్నారు. ఈ కారు పెట్రోల్, సీఎన్‌జీ మోడల్స్‌లో లభిస్తుందన్నారు. పెట్రోల్ మైలేజ్ 19.4 కిలోమీటర్లు, సీఎన్‌జీ మైలేజ్ 27.1 కిలోమీటర్లు వస్తుందన్నారు. ఈ కారు మాన్యువల్, ఆటోగేర్ మోడల్స్‌లో లభిస్తుందన్నారు. ఆరు రంగుల్లో ఈ కార్లు లభిస్తాయన్నారు. ఆపిల్ కార్‌ప్లే, వాయిస్ అసిస్టెంట్, ఆరు ఎయిర్ బ్యాగ్‌లు, సన్‌రూఫ్ వంటి అధునాతన ఫీచర్స్ ఈ కారులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వినియోగదారులు, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు



మండపేట పురపాలక సంఘం

- 2022-23 సంవత్సరానికి తొలి విడత మంజూరు
- కాకినాడ జిల్లాకు రూ.19.03 కోట్లు
- తూర్పుగోదావరి జిల్లాకు రూ.18.49 కోట్లు
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు రూ.5.9 కోట్లు
- తాగునీరు, పారిశుద్ధ్యం నిర్వహణ, రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి ప్రాధాన్యం

మండపేట: 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను నగర, పురపాలక సంస్థలు, నగర పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులొచ్చాయి. తొలి విడతగా తూర్పుగోదావరి జిల్లాకు రూ.18.49 కోట్లు, కాకినాడ జిల్లాకు రూ.19.03 కోట్లు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు రూ.5.9 కోట్లు ఫైనాన్స్ కమిషన్ మంజూరు చేసింది. పారిశుద్ధ్యం, తాగునీటి అవసరాలు, రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి ఈ నిధులు వెచ్చించాల్సి ఉంది.

గత ఆర్థిక సంవత్సరంలో రెండు వాయిదాలకు ఒకేసారి నిధులు విడుదల చేయగా ఈ సంవత్సరం టైడ్, అన్‌టైడ్ గ్రాంటులుగా మొదటి వాయిదాను విడుదల చేసింది. టైడ్ గ్రాంటు నిధులను సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి అవసరాలకు వినియోగించాల్సి ఉంది. అన్‌టైడ్ గ్రాంటు నిధులతో రోడ్లు, డ్రైన్లు నిర్మాణానికి ప్రాధాన్యమివ్వాలి. ఆర్థిక సంఘం నిధుల మంజూరుతో పట్టణాల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు వీలు కలుగులుందని అధికారులు అంటున్నారు.

తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు రూ.15.91 కోట్లు మంజూరు కాగా కొవ్వూరు మున్సిపాల్టీకి రూ.1.24 కోట్లు, నిడదవోలుకు రూ.1.34 కోట్లు మంజూరయ్యాయి. కాకినాడ జిల్లాలో కాకినాడ కార్పొరేషన్‌కు రూ. 9.61 కోట్లు, పిఠాపురంనకు రూ.1.62 కోట్లు, తునికి రూ.1.56 కోట్లు, సామర్లకోటకు రూ.1.88 కోట్లు, పెద్దాపురంనకు రూ.1.69 కోట్లు, ఏలేశ్వరం నగర పంచాయతీకి రూ.1.52 కోట్లు, గొల్లప్రోలుకు రూ.1.15 కోట్లు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురంనకు రూ.1.56 కోట్లు, మండపేటకు రూ.1.74 కోట్లు, రామచంద్రపురంనకు రూ.1.33 కోట్లు, ముమ్మిడివరంనకు రూ.1.27 కోట్లు మంజూరయ్యాయి. ఫైనాన్స్ కమిషన్ మార్గదర్శకాల మేరకు ఆయా పట్టణాల్లో తాగునీటి అవసరాలు, పారిశుద్ధ్యం మెరుగుదల, రోడ్లు, డ్రైన్లు తదితర చేపట్టనున్న పనులకు సంబంధించి స్థానిక సంస్థల ఆమోదంతో అధికారులు తదుపరి కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.

జిల్లాల వారీగా మంజూరైన ఇలా..

తూర్పుగోదావరి : రూ.18.49 కోట్లు

నగరం/పట్టణం	టైడ్ గ్రాంట్	అన్ టైడ్ గ్రాంట్
రాజమహేంద్రవరం	రూ.9.55 కోట్లు	రూ.6.36 కోట్లు
నిడదవోలు	రూ.80.38 లక్షలు	రూ.53.59 లక్షలు
కొవ్వూరు	రూ.74.56 లక్షలు	రూ.49.71 లక్షలు
కాకినాడ జిల్లా : రూ.19.03 కోట్లు		
కాకినాడ	రూ.5.77 కోట్లు	రూ.3.85 కోట్లు
తుని	రూ.93.71 లక్షలు	రూ. 62.47 లక్షలు
సామర్లకోట	రూ. 1.13 కోట్లు	రూ. 75.24 లక్షలు
పిఠాపురం	రూ. 97.06 లక్షలు	రూ. 64.71 లక్షలు
పెద్దాపురం	రూ. 1.01 కోట్లు	రూ. 67.65 లక్షలు
ఏలేశ్వరం	రూ. 91.08 లక్షలు	రూ. 60.72 లక్షలు
గొల్లప్రోలు	రూ. 69.06 లక్షలు	రూ. 46.04 లక్షలు
కోనసీమ జిల్లా : రూ.5.9 కోట్లు		
అమలాపురం	రూ. 93.38 లక్షలు	రూ. 62.25 లక్షలు
మండపేట	రూ. 1.04 కోట్లు	రూ. 69.54 లక్షలు
రామచంద్రపురం	రూ. 80.07 కోటుల్ల	రూ. 53.38 లక్షలు
ముమ్మిడివరం	రూ. 75.92 లక్షలు	రూ. 50.62 లక్షలు

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రతిపాదనలు



2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను 15వ ఆర్థిక సంఘం నుంచి తొలి విడతగా మండపేట మున్సిపాల్టీకి రూ.1.74 కోట్లు మంజూరయ్యాయి. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు టైడ్, అన్‌టైడ్ గ్రాంటులను ఆయా అభివృద్ధి పనులకు కేటాయిస్తాం. ప్రతిపాదనలు సిద్ధం చేసే పనిలో ఉన్నాం.
– టి.రామ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, మండపేట

బోస్ ఆపద ప్రబంధన్ పురస్కార్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ సిటీ: దేశంలో విపత్తు నిర్వహణ రంగంలో విశేష సేవలందించిన సంస్థలు, వ్యక్తులకు గుర్తింపునిస్తూ సత్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సుభాష్‌చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కార్‌కు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా బుధవారం తెలిపారు. 2023, ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు ఇతర వివరాలు హెచ్‌టీటీపీ//అవార్డ్స్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. వ్యక్తిగత, సంస్థల కేటగిరీల కింద దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సంస్థ అవార్డుకు ఎంపికైతే రూ.51 లక్షలు, వ్యక్తిగతంగా అవార్డుకు ఎంపికైతే రూ.5 లక్షల నగదు పురస్కారం లభిస్తుందని వివరించారు. నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని 2024 జనవరి 23వ తేదీన అవార్డులను ప్రకటిస్తారని కలెక్టర్ వివరించారు.

మద్యం దుకాణంలో రూ.11 లక్షలు గోల్‌మాల్

దుకాణ సూపర్‌వైజర్ నిర్వాకంపై విచారణ

అమలాపురం టౌన్: అమలాపురం ఎర్ర వంతెన దిగువన కామనగరువు రోడ్డులో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం అవుట్ లెట్‌లో రూ.11 లక్షలు గోల్‌మాల్ అయ్యాయి. ఈ సొమ్మును దుకాణ సూపర్‌వైజర్ గణేష్ దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు రావడంతో అమలాపురంలోని ఏపీ బేవరీస్ లిక్కర్ డిపో మేనేజర్ విచారణ నిర్వహిస్తున్నారు. దుకాణంలో మద్యం అమ్మకం ద్వారా వచ్చిన సొమ్మును బ్యాంక్‌లో జమ చేసి ఏపీ బేవరీస్ ఆన్‌లైన్‌లో నమోదయ్యేలా చేయాల్సిన బాధ్యత సంబంధిత దుకాణ సూపర్‌వైజర్‌దే. అయితే ఈ దుకాణం ద్వారా వచ్చిన రూ.11 లక్షలు సూపర్‌వైజర్ గణేష్ బ్యాంక్‌లో జమ చేశానని చెబుతున్నప్పటికీ ఏపీ బేవరీస్‌లో ఆ నిధులు జమ అయినట్లు ఆన్‌లైన్‌లో చూపించడంలేదు. దీనిపైనే అధికారులు విచారణ చేస్తున్నారు. సూపర్‌వైజర్ తాను బ్యాంక్‌లో సొమ్ము జమచేసినట్లు సంబంధిత బ్యాంక్‌కు చెందిన నకిలీ కౌంటర్ ఫాయిల్‌ను చూపిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం సూపర్‌వైజర్ గణేష్ విధులకు హాజరు కాకపోవడంతో అతనే బాధ్యుడన్న అనుమానాలు బలపడుతున్నాయి. గణేష్ తిరుపతి వెళ్లాడని దుకాణ సిబ్బంది చెబుతున్నారని.. అతను తిరుపతి నుంచి వచ్చిన తర్వాత విచారణ చేసి సొమ్ము దుర్వినియోగం రుజువైతే చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. ఈ విషయమై ఏపీ బేవరీస్ అమలాపురం లిక్కర్ డిపో మేనేజర్ దశమంతరావును వివరణ కోరగా ఎర్రవంతెన దిగువన అవుట్ లెట్ మద్యం దుకాణంలో రూ.11 లక్షలు సొమ్ము తమ ఆన్‌లైన్‌లో ఇంకా జమ కాలేదని చెప్పారు. ఆ డబ్బు జమ చేయాల్సిన దుకాణ సూపర్‌వైజర్ బ్యాంక్‌లో జమ చేశానని చెబుతున్నప్పటికీ ఆన్‌లైన్‌లో జమ కాలేదని తెలిపారు. ఒక్కోసారి బ్యాంక్‌లో జమ చేసిన సొమ్ము బేవరీస్ ఆన్‌లైన్‌లో ఆలస్యంగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ సాంకేతిక కారణాలపై కూడా ఆరా తీస్తున్నామన్నారు.

చీటీల వ్యాపారి పరారీ

- సుమారు రూ.6 కోట్ల వరకు టోపీ
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు



ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో చిట్టీల వ్యాపారీ పరారీ కావడంతో బాధితులు గగ్గోలు పెడుతున్నారు. స్థానిక స్టేట్‌బ్యాంక్ రోడ్డులో శ్రీదత్తసాయి జ్యూయలరీస్ యజమాని శేరు వీరబాబు చీటీదారులకు సుమారు రూ.6 కోట్ల వరకు మోసం చేసి మాయమవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శేరు వీరబాబు ఇరవై ఏళ్ళుగా చిట్టీలు నిర్వహిస్తున్నాడు. నగల దుకాణం కూడా ఉంది. రూ. లక్ష నుంచి రూ.10 లక్షల వరకు చీటీలు నిర్వహిస్తున్నాడు. చీటీలు నిర్వహించడమే కాకుండా కొంతమంది నుంచి రుణాలు కూడా తీసుకున్నాడు. కుటుంబ ఖర్చుల కోసం, పిల్లల పెళ్లిళ్లు, వ్యాపారాలు, తదితర అవసరాల రీత్యా చాలామంది అతని వద్ద చిట్టీలు కట్టుకున్నారు. చీటీ పాడిన వ్యక్తులకు సొమ్ము ఇవ్వకుండా రూ.2 వంతున వడ్డీతో ఇస్తానని నమ్మబలికి, సదరు సొమ్మును తన వద్దే ఉంచుకునేవాడు. రూ.2 వడ్డీపై మరికొంత మంది నుంచి రుణాలు కూడా తీసుకున్నాడు. బంగారు నగల దుకాణంపై రుణాలు ఇచ్చిన, చెల్లింపులు జరపని చీటీ పాటదారుల నుంచి ఒత్తిడులు రావడంతో పరారైనట్టు తెలుస్తోంది. బడా వ్యాపారుల నుంచి సామాన్యుని వరకు వీరబాబు నిర్వహించే ఆర్థిక లావాదేవీల్లో 180 మంది వరకు భాగస్వాములై ఉన్నారు. నాలుగు రోజులుగా నగల దుకాణం తెరవకపోవడం, శేరు వీరబాబు ఇంటికి తాళం వేసి ఉండడంతో బాధితులు ఆందోళన చెందారు. ఒకవైపు బాకీదారులు, మరోవైపు పాట దారుల నుంచి ఒత్తిడి రావడంతో పరారైనట్టు తెలుస్తోంది. స్థానిక వ్యాపారి అనంతపల్లి శ్రీను ఆధ్వర్యంలో బాధితులు ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌కు ర్యాలీగా వెళ్లి, ఫిర్యాదు చేశారు.

2.5 కేజీల గంజాయితో నలుగురి అరెస్టు



కొత్తపేట ఎస్ఈబీ స్టేషన్‌లో నిందితులు, గంజాయితో అడిషనల్ ఎస్పీ ఖాదర్‌భాషా, సీఐ శ్రీనివాస్ తదితరులు

కొత్తపేట: గంజాయి సరఫరాపై దాడులు నిర్వహించి 2.5 కేజీల గంజాయితో వివిధ ప్రాంతాలకు చెందిన నలుగురిని అరెస్టు చేసినట్టు జిల్లా అడిషనల్ ఎస్పీ ఖాదర్‌భాషా తెలిపారు. బుధవారం ఆయన స్థానిక ఎస్ఈబీ స్టేషన్‌లో పట్టుకున్న నిందితులు, గంజాయితో కేసు వివరాలను తెలిపారు. స్థానిక ఎస్ఈబీ స్టేషన్‌కు వచ్చిన సమాచారం మేరకు మంగళవారం విస్తృతంగా దాడులు జరిపామన్నారు. ఈ దాడుల్లో పాడేరుకు చెందిన కిల్లో రమేష్‌బాబు ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన షేక్ సునీల్ మీరా, రాజమహేంద్రవరానికి చెందిన గెడ్డం కుమారి, ర్యాలికి చెందిన బండెల రామాంజనేయులును అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 2.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

గంజాయిపై స్పెషల్ డ్రైవ్

ఒడిశా రాష్ట్రం నుంచి వివిధ మార్గాల ద్వారా గంజాయి చేరవేస్తున్నారనే సమాచారం మేరకు జిల్లాలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి దాడులు నిర్వహిస్తున్నట్టు అడిషనల్ ఎస్పీ ఖాదర్ బాషా తెలిపారు. జిల్లా ఎస్పీ ఎస్. శ్రీధర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని స్టేషన్ల పరిధిలో ప్రత్యేక పోలీసు బృందాల సహాయంతో గంజాయిపై దాడులు నిర్వహిస్తున్నామన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు ఎస్ఈబీ, పోలీసుల ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా వివిధ పాఠశాలలు, కళాశాలల్లో యువతపై మాదక ద్రవ్యాల ప్రభావం పడకుండా, వాటివలన వారి భవిష్యత్ నాశనం కాకుండా ఉండటం కోసం ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రధాన కూడళ్లలో మాదక ద్రవ్యాల వినియోగ నియంత్రణకు సంబంధించి హోర్డింగులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లాలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ యాక్టు ప్రయోగిస్తామని హెచ్చరించారు. గంజాయి కేసును పట్టుకున్న స్థానిక ఎస్ఈబీ సీఐ మద్దాల శ్రీనివాస్, డీటీఎఫ్ సీఐ కె.వీరబాబు, సిబ్బందిని ఆయన అభినందించారు.

గుండె రక్షణకు జీవనశైలిలో మార్పులు

'నన్నయ'లో ఇంటర్నేషనల్ గెస్ట్ లెక్చర్‌లో డాక్టర్ స్వామి సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ స్వామి

రాజానగరం: ప్రస్తుత పోటీ ప్రపంచంలో వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ఒత్తిడికి గురవుతున్నారని, ఈ కారణంగానే చాలామందిలో ఆకస్మిక గుండె పోట్లు సంభవిస్తున్నాయని హెచ్‌ఓడీ అండ్ ప్రొఫెసర్ ఆఫ్ క్లినికల్ న్యూరో అనాటమీ, డైరెక్టర్ ఆఫ్ ఇంటర్నేషనల్ అఫైర్స్ లింకన్ యూనివర్సిటీ (మలేషియా) ప్రొఫెసర్ డాక్టర్ స్వామి కేబీ అన్నారు. అయితే వీటి నుంచి రక్షణ పొందాలంటే మన జీవనశైలిలో మార్పు రావాలన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, డిపార్టుమెంట్ ఆఫ్ లైఫ్ సైన్స్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఇంటర్నేషనల్ గెస్ట్ లెక్చర్ ఇచ్చారు. మారుతున్న ఆహారపు అలవాట్లు, వాతావరణ పరిస్థితులు, శరీర, మానసిక, ఆరోగ్య సమస్యలు వంటివి గుండె పోటు సమస్యకు ఏవిధంగా కారణమవుతున్నాయో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గుండె సంబంధిత వివిధ సమస్యలను ముందుగా గుర్తించడం, వాటికి తగిన జాగ్రత్తలు తీసుకోవడం గురించి అవగాహన కలిగించారు. ఆహారపు అలవాట్లను మార్చుకోవడంతో పాటు మద్యపానం, ధూమపానం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని చెప్పారు. ఒత్తిళ్లకు లోనుకాకుండా, రోజూ తగిన వ్యాయామం చేయడం ద్వారా గుండె సమస్యలకు చాలావరకు దూరంగా ఉండవచ్చన్నారు. ఈ సందర్భంగా గుండెపోటు వస్తే చేయవలసిన ప్రథమ చికిత్స, గోల్డెన్ అవర్‌ల గురించి అవగాహన కలిగించారు. గ్యాస్ట్రిక్ సమస్యలు, గుండె సమస్యల మధ్య ఉన్న తేడాలను వివరించారు. రెగ్యులర్‌గా వైద్య పరీక్షలు చేయించుకోవడం ఎంతో అవసరమన్నారు. 'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో వయసుతో సంబంధం లేకుండా చాలామంది గుండెపోటుకు గురవుతున్నారన్నారు. ఇటువంటి సమయంలో తీసుకోవలసిన ప్రాథమిక చికిత్సతోపాటు ఆరోగ్యంగా ఉండేందుకు అనుసరించవలసిన జాగ్రత్తలపై కూడా అవగాహన కలిగివుండాలన్నారు. డాక్టర్ పి.విజయనిర్మల కన్వీనర్‌గా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎ. మట్టారెడ్డి, డాక్టర్ డి.కల్యాణి, జ్యోతి స్వామి, లైఫ్ సైన్స్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.22 లక్షల విలువగల 131 సెల్‌ఫోన్లు పట్టివేత

పోగొట్టుకున్న బాధితులకు అందజేత



పోయిన సెల్‌ఫోనును తిరిగి బాధితురాలికి అప్పగిస్తున్న ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో వివిధ ప్రాంతాల్లో చోరీలకు గురైన, పోగొట్టుకున్న 131సెల్ ఫోన్లను క్రైం పోలీసులు స్వాధీనం చేసుకుని బాధితులకు తిరిగి అప్పగించారు. ఆ మేరకు బుధవారం రాజమహేంద్రవరం దిశ పోలీసుస్టేషన్‌లో జిల్లా ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ వివరాలు తెలిపారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న కేసుల దర్యాప్తునకు సీఇఐఆర్ (సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటీ రిజిస్ట్రేషన్) సేవలు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ఇటీవల జిల్లాలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు ఎక్కువ అవడంతో క్రైం అదనపు ఎస్పీ జి.వెంకటేశ్వరరావు, క్రైం డీఎస్పీ జి.గురునాథ్ పర్యవేక్షణలో దర్యాప్తు చేశామన్నారు. సీఇఐఆర్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా గుర్తించి రూ.22 లక్షలు విలువగల 131 సెల్‌ఫోన్లు రికవరీ చేశామన్నారు. కొన్ని సెల్‌ఫోన్లు కేరళ, మహారాష్ట్ర, ముంబై, కర్నాటక ప్రాంతాలకు చేరాయని, వాటిని కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎవరికైనా దొరికితే సమీప పోలీసు స్టేషన్లో అందించాలని ఎస్పీ కోరారు. దొరికిన ఫోన్లు ఉపయోగించడం, లేదా విక్రయించడం చేయరాదన్నారు. దుకాణ యజమానులు కూడా సరైన బిల్లులు లేకుండా సెల్‌ఫోన్లు కొనుగోలు చేయరాదు, విక్రయించరాదన్నారు. దర్యాప్తులో త్రీటౌన్ క్రైం ఎస్సై షరీఫ్, జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్ల సీఐలు ఐటీ కోర్ సిబ్బంది కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా వారిని ఎస్పీ అభినందించారు. అనంతరం బాధితులకు వారు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేశారు.

రైతు దినోత్సవ పురస్కార అవార్డులు

పది మంది ఉత్తమ కర్షకులు, వివిధ రంగాల్లో నిష్ణాతులకు సన్మానం



ఉత్తమ నర్సరీ రైతు పురస్కారాన్ని మధుకుమార్‌కు అందజేస్తున్న సంస్థ డైరెక్టర్ కేవీ రెడ్డి తదితరులు

రావులపాలెం: రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కర్రి కొండయ్య గారి తాతారెడ్డి చారిటబుల్ ట్రస్ట్, ఆర్గాటిక్ చిల్లీ ఫార్మ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పది మందికి ఉత్తమ రైతు పురస్కార అవార్డులు ఇచ్చి ఘనంగా సన్మానించారు. బుధవారం స్థానిక వేమన కల్చరల్ అసోసియేషన్‌లో ట్రస్ట్, సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆర్గాటిక్ చెల్లీ ఫార్మ్స్ డైరెక్టర్ కేవీ రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులు రాష్ట్ర పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు కర్రి ముకుందరెడ్డి, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తరఫున సోదరి శైలజ, రావులపాలెం ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకట నాగదేవి, వాడపల్లి వేంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ రుద్రరాజు వెంకట సత్య సూర్యనారాయణ అచ్యుత రామరాజు చేతుల మీదుగా సన్మానం చేశారు.

సన్మాన గ్రహీతలు

ఉత్తమ రైతు పురస్కారానికి పొంగుటూరు చెందిన ఆకుల వీర్రాజు, మహిళా రైతు పురస్కారానికి సూర్యాపేట జిల్లా దోసపాడుకి చెందిన వరికుప్పల నాగమణి, ఆదర్శ రైతు పురస్కారానికి గుంటూరు జిల్లా పెదకూరపాడుకి చెందిన వడ్లమూడి వెంకట్రావు, ఉత్తమ కంద రైతు పురస్కారానికి కొమరాజులంక పంచాయతీ సర్పంచ్ కర్రి వెంకట గోవింద కృష్ణారెడ్డి, ఉత్తమ కోళ్ల రైతు పురస్కారానికి కొమరపాలెంకు చెందిన కర్రి ముకుంద రెడ్డి, ఉత్తమ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడి పురస్కారానికి కొత్తపేటకు చెందిన ఎస్‌వీఎస్ఎస్ రెడ్డియ్య, ఉత్తమ జ్యోతిష్య సిద్ధాంతి పురస్కారానికి రాజమండ్రికి చెందిన జయంతి గౌతమ శాస్త్రి, ఉత్తమ నర్సరీ రైతు పురస్కారానికి ధర్మాజీగూడెంకు చెందిన పాడపాటి మధుకుమార్, 1982 బ్యాచ్ ఉత్తమ పూర్వ విద్యార్థి పురస్కారానికి గొల్లల మామిడాడకు చెందిన మండా రాజారెడ్డి, 1982 బ్యాచ్ ఉత్తమ పూర్వ విద్యార్థిని పురస్కారానికి విశాఖపట్నానికి చెందిన కత్తుల అన్నామణి ఎంపికయ్యారు. రాష్ట్ర ట్రేడ్ కమిషనర్ కేవీ రెడ్డి, కర్రి సత్తిరెడ్డి, శ్యామ్ సుందరరెడ్డి, కమలారెడ్డి పాల్గొన్నారు.

మైనరు ఆత్మహత్య



రవికిషోర్ మృతదేహం

కాకినాడ క్రైం: తండ్రి మందలించాడని మనస్థాపానికి గురైన పదహారేళ్ల మైనరు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాకినాడ బుడంపేటకు చెందిన గింజాల రవికిషోర్(16) స్థానిక టీవీఎస్ షోరూంలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. కొద్ది రోజులుగా స్నేహితులతో తిరుగుతూ రాత్రి వేళల్లో ఇంటికి ఆలస్యంగా వస్తున్నాడు. ఈ క్రమంలోనే మంగళవారం విధులకు వెళ్లి బుధవారం తెల్లవారుజామున మూడు గంటలకు ఇంటికి వచ్చాడు. ఎందుకిలా చేస్తున్నావంటూ తండ్రి ప్రసాద్ మందలించాడు. దీంతో మనస్థాపానికి గురైన రవికిషోర్ ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. తండ్రి గమనించి హుటాహుటిన కాకినాడ జీజీహెచ్‌కు తరలించాడు. చికిత్స పొందుతూ రవికిషోర్ మృతి చెందాడు. ఈ ఘటనపై కాకినాడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మార్కులు తక్కువ వచ్చాయని మందలిస్తారని...!

బీటెక్ విద్యార్థి రైలు కింద పడి ఆత్మహత్య

పిఠాపురం: మార్కులు తక్కువ వచ్చాయని మందలిస్తారని భయపడి బీటెక్ విద్యార్థి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న విషాదకర ఘటన బుధవారం పిఠాపురం సమీపంలో చిత్రాడ రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద చోటు చేసుకుంది. సామర్లకోట రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడుకు చెందిన ఊటా నాగ వెంకట్ (21) సూరంపాలెంలో ఒక ప్రైవేటు కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుకుంటున్నాడు. ఇటీవల విడుదల చేసిన ప్రథమ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో తక్కువ మార్కులు రావడంతో పాటు కొన్ని సబ్జెక్టులు ఫెయిల్ అయ్యాడు. మంగళవారం అతనిని మందలించిన అధ్యాపకులు ఈ విషయం ఫోన్ ద్వారా అతని తల్లిదండ్రులకు చెప్పి, వారిని వెంట తీసుకురావాలని ఆ విద్యార్థికి చెప్పారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన వెంకట్ ఇంటికి వెళ్లి విషయం తల్లిదండ్రులకు చెప్పి కనిపించకుండా పోయాడు. దీంతో అతని కోసం తల్లిదండ్రులు బంధువులు ఎంత గాలించినా ప్రయోజనం కనిపించలేదు. బుధవారం ఉదయం పిఠాపురం సమీపంలో చిత్రాడ రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద రైలు పట్టాలపై ఒక యువకుడి మృతదేహం ఉన్నట్లు సామర్లకోట రైల్వే పోలీసులు గుర్తించారు. ఆరా తీయగా మృతి చెందిన యువకుడు ఇంటి నుంచి కనిపించకుండా పోయిన ఊటా నాగ వెంకట్‌దిగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న సామర్లకోట రైల్వే పోలీసులు మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వెంకటేశ్వర్లు శర్మకు స్వర్ణ నంది పురస్కారం



పురస్కారం అందుకుంటున్న శర్మ

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ క్షేత్రపాలకుడు శ్రీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం అర్చకులు బ్రహ్మశ్రీ రత్న ఇలపర్తి పల్ల వెంకటేశ్వర్లు శర్మకు ఆదర్శ స్వర్ణ నంది పురస్కారం దక్కింది. జ్యోతిష్య శాస్త్రంలో కుజదోషం మీద విశేషమైన పరిశోధన జరిపినందుకు అ వార్డు దక్కించుకున్నారు. ఆదర్శ కళానిలయం హైదరాబాద్‌లో దేవులపల్లి రామానుజ రావు కళామందిర్‌లో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో శర్మను స్వర్ణ నంది పురస్కారంతో సత్కరించారు. శర్మను ఆలయ వాడపల్లి ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు, ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది అభినందించారు.